
క్లుప్తంగా

వెంకన్నకు ప్రత్యేక పూజలు


పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాలబోగం నిర్వహించారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వ దర్శనాలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

వేంకటేశ్వర స్వామికి బంగారు నామాల అందజేత


స్వామికి బంగారు నామాలు అందజేస్తున్న లక్ష్మీనరసింహారావు దంపతులు

పరవాడ: మండలంలో ఈ.బోనంగి శివారు ఫార్మాసిటీ కాలనీలో కొండపై కొలువుదీరిన శ్రీభూసమేత అభయ వేంకటేశ్వర స్వామి ఆలయంలోని అమ్మవార్ల విగ్రహాలకు రూ. 20 వేల విలువైన బంగారు నామాలను పోర్టుకో ప్రాంతానికి చెందిన సారపల్లి లక్ష్మీనరసింహారావు దంపతులు ఆలయ కమిటీ ప్రతినిధులు బుగిడి రామగోవిందరావు, మేడిశెట్టి బాలాజీనాయుడుకు శనివారం అందజేశారు. వారికి ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నేడు సత్తెమ్మతల్లి పండగ


విశేష అలంకారంలో సత్తెమ్మతల్లి

సింహాచలం: అడవివరం గ్రామ పొలిమేర దేవత, శ్రీనివాసనగర్ పరిసర ప్రాంతాల ఆరాధ్య దైవం సత్తెమ్మతల్లి పండగ ఆదివారం జరగనుంది. ఈ మేరకు ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షుడు పి.వెంకటరావు ఆధ్వర్యంలో విశేషంగా ఏర్పాట్లు చేశారు. పండగని పురస్కరించుకుని అమ్మవారి విగ్రహాన్ని విశేషంగా ముస్తాబు చేశారు. ఆలయానికి పూలాలంకరణ, విద్యుద్దీపాలంకరణ చేశారు. ఉదయం 4 గంటలకు సుప్రభాతసేవ, ఆరాధన, విశేష పూజలు నిర్వహించనున్నారు. అనంతరం ఉదయం 6 గంటల నుంచి రాత్రి వరకు భక్తులకు అమ్మవారి దర్శనాలు కల్పిస్తారు. భక్తులకు ప్రసాద, మజ్జిగ వితరణ చేయనున్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం


నిత్యకల్యాణంలో మాంగళ్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

కానిస్టేబుల్ పరీక్షా నిర్వహణ కేంద్రాల పరిశీలన

పెందుర్తి: రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఆదివారం జరగనున్న పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్ష పకడ్బందీగా నిర్వహించనున్నట్లు నగర డిప్యూటీ పోలీస్ కమిషనర్ (లా అండ్ ఆర్డర్) మేరీ ప్రశాంతి అన్నారు. శనివారం పెందుర్తిలోని పరీక్షా కేంద్రాలైన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఆదర్శ్ డిగ్రీ కళాశాలలను పరిశీలించారు. అభ్యర్థులకు కల్పిస్తున్న వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 500 మంది, ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో 252 మంది పరీక్ష రాస్తారన్నారు. పరీక్ష ప్రశాంతంగా, నిష్పాక్షికంగా, పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. కేంద్రాల వద్ద బందోబస్త్‌కు తగిన సిబ్బందిని నియమిస్తామని పేర్కొన్నారు. వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ ప్రథ్వీతేజ్, పెందుర్తి సీఐ కె.వి సతీష్‌కుమార్ డీసీపీ వెంట ఉన్నారు.

అందం.. ఆరోగ్యం.. ఆహ్లాదం

పిల్లలు, పెద్దలను ఆకట్టుకుంటున్న ఈ.బోనంగి దరి ఫార్మాసిటీ కాలనీలో ఏర్పాటు చేసిన పార్క్

ముచ్చటగొల్పుతున్న వాటర్ ఫాల్ • చిన్నారులను ఆకట్టుకుంటున్న ఆట పరికరాలు


ఫార్మాసిటీ కాలనీలో ఏర్పాటు చేసిన ఉద్యానవనం

పరవాడ: మండలంలో ఈ.బోనంగి దరి ఫార్మాసిటీ కాలనీలో సుందరంగా తీర్చిదిద్దిన ఉద్యానవనం పిల్లలు, పెద్దలను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ.బోనంగి సర్పంచ్ బొద్దపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సాధారణ నిధులు రూ.40 లక్షలతో ఏర్పాటు చేసిన ఉద్యానవనం అన్ని వర్గాల ప్రజలను ఆకర్షిస్తుంది. 9 నెలల క్రితం పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ప్రారంభించిన ఉద్యానవనం వ్యాయామ అభ్యాసకులు, చిన్నారులు, వృద్ధులకు ప్రయోజనకరంగా ఉంది. చిన్నారుల ఆట పాటలకు, వ్యాయామ అభ్యాసకులకు అవసరమైన మౌలిక సదుపాయలు ఈ ఉద్యానవనంలో కల్పించారు. పరవాడ ప్రాంతంలో మరెక్కడా లేని విధంగా సకల సౌకర్యాలతో తీర్చిదిద్దిన ఉద్యానవనం ఈదులపాక బోనంగి, బొద్దపువానిపాలెం, ఫార్మాసిటీ కాలనీ, గౌతులచ్చన్ననగర్ ప్రాంత వాసులు వరంగా భావిస్తున్నారు. ఉద్యానవనం అందాలను పర్యవేక్షించేందుకు కాపలాదారుని నియమించారు.


చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఆట పరికరాలు


ఉద్యానవనంలో ముచ్చట గొలిపే వాటర్ ఫాల్


వ్యాయామం కోసం ఏర్పాటు చేసిన పరికరాలు

పార్క్ ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన వాటర్ ఫాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. పార్క్ ఇరువైపుల నిర్మించిన వాకింగ్ ట్రాక్ వాకింగ్ చేసే వారికి సౌలభ్యంగా ఉంది. చిన్నారులకు క్రీడా పరికరాలు, పెద్దలకు వ్యాయామ పరికరాలను మహారాష్ట్ర నుంచి తీసుకొచ్చి ఇక్కడ ఏర్పాటు చేశారు. కడియం నుంచి తీసుకొచ్చిన గార్డెన్ గ్రాస్, వివిధ రకాలకు చెందిన పూల మొక్కలతో పార్క్‌ను చూడముచ్చటగా తీర్చిదిద్దారు. పార్క్‌లో ఏర్పాటు చేసిన పచ్చని పచ్చిక బైళ్లు, పూల మొక్కలతో తీర్చిదిద్దిన గార్డెన్, సందర్శకులు సేదదీరేందుకు సిమెంటు బల్లలు, పార్క్‌ను తళుక్కుమనిపించే విద్యుత్ దీపాల వెలుగులు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ పార్క్ అందాలను ఆస్వాదించడానికి పరిసర ప్రాంతాల నుంచి సందర్శకులు ఎగబడుతున్నారు. ఉదయం 5 నుంచి 7 వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 7.30 గంటల వరకు పార్కును తెరచి ఉంచుతారు.

ఆట వస్తువులు బాగున్నాయి..



ఉద్యానవనంలోని ఆట వస్తువులు బాగున్నాయి. పాఠశాలలకు సెలవులు కావడం వల్ల ఉదయం, సాయంత్రం పార్క్‌కు వచ్చి ఆట పాటలతో ఉత్సాహంగా గడుపుతున్నాం. స్నేహితులమంతా ఒకచోట కలుసుకుని ఆడుకుంటున్నాం. ఈ పార్కు అందరికీ నచ్చింది. ఇక్కడి సౌకర్యాలు బాగున్నాయి.

–భవ్య, విద్యార్థిని, ఫార్మాసిటీ కాలనీ

వ్యాయామానికి అనుకూలం..



వ్యాయామం చేయడానికి దూర ప్రాంతాల్లో ఉన్న జిమ్ ప్రాంగణాలకు వెళ్లాల్సి వచ్చేది. పార్క్‌లో ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలతో దూరాభారం వెళ్లాల్సిన పని లేకుండా పోయింది. వ్యాయామానికి అవసరమైన అన్ని రకాల పరికరాలు ఇక్కడ ఉన్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో అందుబాటులో ఉన్న పార్క్‌కు వచ్చి ఓ గంట వ్యాయామం చేస్తున్నాం.

– జి.శ్రీనివాసరావు, వ్యాయామ అభ్యాసకులు, ఈ.బోనంగి

మరిన్ని సౌకర్యాలు కల్పిస్తాం..



అన్ని వర్గాల ప్రజలకు అవసరమైన పార్క్‌ను మరింతగా తీర్చిదిద్దుతాం. పార్క్‌లో చిన్నారులు, పెద్దలకు వ్యాయామం, ఆట పాటలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాం. పార్క్ అందాలను కాపాడేందుకు ప్రత్యేకంగా కాపలాదారుని నియమించాం. ఉద్యానవనంలో సౌకర్యాల కల్పనకు పంచాయతీ బాధ్యత తీసుకుంటుంది. పార్క్ మెయింటెనెన్స్ కోసం సీఎస్సార్ నిధులు మంజూరు చేయాలని ఫార్మా యాజమాన్యాలను కోరుతాం.

– బొద్దపు శ్రీనివాసరావు, సర్పంచ్, ఈ.బోనంగి

రేషన్ డిపో ఏర్పాటుకు డిమాండ్


టిడ్కో కాలనీలో ఆందోళన చేస్తున్న స్థానికులు

పరవాడ: టిడ్కో కాలనీ వాసులకు అందుబాటులో ఉండే విధంగా రేషన్ డిపో ఏర్పాటు చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు డిమాండ్ చేశారు. టిడ్కో కాలనీలో రేషన్ డిపో ఏర్పాటు చేయాలని కోరుతూ ఐద్వా ఆధ్వర్యంలో కాలనీవాసులు శనివారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఐద్వా కార్యకర్తలు మాట్లాడుతూ కాలనీ వాసులకు స్థానికంగా రేషన్ డిపో ఏర్పాటు చేసి 14 రకాల నిత్యావసర సరుకులు అందజేయాలని డిమాండ్ చేశారు. దూర ప్రాంతంలో ఉన్న రేషన్ డిపోలకు వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోవడం తలకు మించిన భారమవుతుందన్నారు. ప్రస్తుతం కొనసాగిస్తున్న ఇంటి వద్దకే నిత్యావసర సరుకుల పంపిణీని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో మన్యాల బంగారమ్మ, తుంపాల అన్నపూర్ణ, ఎం. సంతోష్‌కుమారి, మంగ, కనకమహాలక్ష్మి, బేగం, ఎస్. గంగాభవానీ, లావణ్య, రమ, లక్ష్మి, సీత, రమణమ్మ, గోపాలరావు, పారు, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మే పుష్పం


చూడముచ్చట గొలుపుతున్న మే పుష్పం

పరవాడ: పరవాడ గ్రామానికి చెందిన ఆర్.హేమలత ఇంట్లో పూచిన మే పుష్పం స్థానికులను విశేషంగా ఆకర్షించింది. ఇది ఏడాదికొకపర్యాయం అంటే మే నెలలో మాత్రమే పూస్తుందని ఇంటి యజమాని హేమలత తెలిపారు. మేలో పూచిన పువ్వు రెండు నెలలు వికసిస్తూ ఉంటుంది. ఆ తర్వాత చెట్టు చనిపోతుంది. మళ్లీ దుంప నుంచి చెట్టు చిగురించి మే నాటికి పువ్వు పూస్తుందని హేమలత చెప్పారు.

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

మల్కాపురం: నేటి యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి, జ్ఞానం పొందుతూ, మంచి పుస్తకాలు చదువుతూ ఆరోగ్యవంతమైన జీవితానికి పునాదులు వేసుకోవాలని బ్రహ్మకుమారి సంస్థ (శ్రీహరిపురం) నిర్వాహకురాలు సింధు అన్నారు. మాదకద్రవ్యాల సేవించడం వల్ల కలిగే పరిణామాలను వివరిస్తూ 60వ వార్డు గుల్లపాలెం, వాకింగ్ పార్కు వద్ద శనివారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎంతో విలువైన జీవితాన్ని చెడు అలవాట్ల వల్ల నాశనం చేసుకోకూడదని సింధూ సూచించారు. ఖైనీ, గుట్కా, పాన్‌పరాగ్, ధూమపానం, మద్యపానం వంటివి ఆరోగ్యాన్ని పాడుచేస్తాయని, తద్వారా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు రోడ్డున పడే పరిస్థితి వస్తుందని ఆమె హెచ్చరించారు. నిత్యం నచ్చిన దేవుడిని ప్రార్థిస్తూ, మంచి స్నేహితులతో పరిచయాలు పెంచుకొని, మంచి పుస్తకాలు చదువుతూ సమాజం గుర్తించే స్థాయికి ఎదగాలని ఆమె యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధులు ధర్మబాయి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల బకాయి వేతనాలు చెల్లించాలి



బకాయి వేతనాల కోసం ఆందోళన చేస్తున్న ఉపాధి కూలీలు

పరవాడ: ఉపాధిహామీ కూలీలకు చెల్లించాల్సిన 8 వారాల బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పరవాడలో చేపట్టిన ఉపాధి హామీ పని ప్రదేశంలో శనివారం ఉపాధి కార్మికులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి హామీ కార్మికులకు 8 వారాల నుంచి బకాయి వేతనాలు అందక అర్థాకలితో అలమటిస్తున్నారన్నారు. ఉపాధి పనులు చేస్తున్న కార్మికులకు మంచినీరు, మజ్జిగ వంటి సదుపాయాలు కల్పించాలన్నారు. పార, తట్ట, గునపాం వంటి సామగ్రికి డబ్బులు చెల్లించాలన్నారు. వేసవి వేతనం కలిపి 40 శాతం అదనంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు ఏడాదికి 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజుకి రూ.600 వేతనంగా చెల్లించాలన్నారు. ఉపాధి హామీ కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని గనిశెట్టి హెచ్చరించారు.

బొమ్మలు తయారు చేద్దాం రండి


పేపర్ క్రాఫ్ట్ చేస్తున్న విద్యార్థులు

పెందుర్తి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం కథలు చదవడం, రాయడం, చెప్పడంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఉపాధ్యాయుడు ఎం.ఎస్. మహేష్ పేపర్‌తో బొమ్మలు తయారు చేయడం నేర్పించారు. అనంతరం సామూహిక పుస్తక పఠనం చేయించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు ఇంగ్లీష్ నేర్పించారు. పలు ఆటలు ఆడించారు. యోగా గురువు లక్ష్మీప్రసన్న ధ్యానంపై మెలకువలు నేర్పారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, పలువురు పాఠకులు పాల్గొన్నారు.

పదవీ విరమణ ఉద్యోగులకు సత్కారం


పదవీ విరమణ చేసిన ఉద్యోగులను సత్కరిస్తున్న దేవస్థానం అధికారులు

సింహాచలం: దేవస్థానంలో ఉద్యోగం చేయడం భగవంతుడు ఇచ్చిన వరంగా భావించాలని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఏఈవోలు ఆనంద్ కుమార్, శ్రీనివాసరావు తెలిపారు. దేవస్థానంలో డిప్యూటీ ఇంజినీర్‌గా విధులు నిర్వర్తించిన నాగేశ్వరరావు, నాల్గవ తరగతి ఉద్యోగి సత్యారావు శనివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా వారిని దేవస్థానం ఉద్యోగుల సంఘం ఘనంగా సత్కరించింది. సింహగిరి కల్యాణమండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది పదవీ విరమణ చేసిన ఉద్యోగులను దుశ్శాలువాలతో సత్కరించారు. స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏఈవోలు మాట్లాడుతూ దేవస్థానంలో ఉద్యోగం కొందరికే వరిస్తుందని, భగవంతుడు ఇచ్చిన ఈ అవకాశాన్ని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. భక్తులకు అంకితభావంతో సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈ రాంబాబు, డీఈ హరి, ఏఈ తాతాజీ, సూపరింటెండెంట్ నరసింగరావు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సాగులో వ్యవసాయ పద్ధతులపై అవగాహన


డ్రోన్ల ద్వారా మందుల పిచికారీ గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

సబ్బవరం: రైతులు తొలకరిలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను, కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలపై జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు రైతులకు వివరించారు. మండలంలోని నారపాడు, అమృతపురం గ్రామాల్లో భారతీయ వ్యవసాయ మంత్రిత్వ శాఖ, భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వీక్షిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భూసార పరీక్షల విశిష్టతను వివరించారు. ఉద్యాన శాఖ అధికారి ప్రభాకరరావు మాట్లాడుతూ ఉద్యాన పంటల్లో ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. జిల్లా నోడల్ ఆఫీసర్, కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎం. రాజ్ కుమార్ మాట్లాడుతూ రైతులు పురుగులు, తెగుళ్ల నివారణలో తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎ. సౌజన్య మాట్లాడుతూ వరి పంటలో సాగుచేసే నూతన రకాలైన ఎంటీయూ–1224, ఎంటీయూ–1262, బీపీటీ–2295, బీపీటీ–2846, ఎంటీయూ–1318 రకాల స్వభావం గురించి వివరించారు.ఈ కార్యక్రమానికి భారతీయ వ్యవసాయ పరిశోధన మండలం నుండి నామినేట్ అయిన డాక్టర్ ఎం. వెంకటేశం, టి. కిరణ్ ఎరువుల యాజమాన్యం, పంటల దిగుబడికి చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం కొండెంపూడి శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం. సత్తిబాబు, డాక్టర్ ఎ. సౌజన్య, డాక్టర్ కిశోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు మహిళా దొంగల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న క్రైం విభాగం ఎస్ఐ సూరిబాబు


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

పెందుర్తి: ఆటోల్లో ప్రయాణికుల బ్యాగుల్లో విలువైన వస్తువులను ఎత్తుకుపోతున్న ఇద్దరు మహిళా దొంగలను పెందుర్తి క్రైం విభాగం పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.4 లక్షల విలువైన సుమారు 50 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. శనివారం పెందుర్తి క్రైం విభాగం పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ డి.సూరిబాబు వివరాలను వెల్లడించారు. విజయనగరం జిల్లా గుర్లకు చెందిన గొలజాన మోహిని గత నెల 7న పెందుర్తి మండలం రాంపురంలో ఓ శుభకార్యానికి వచ్చింది. తిరిగి సొంత ఊరు వెళ్లేందుకు గత నెల 10న రాంపురం నుంచి పెందుర్తి వరకు ఆటో ఎక్కింది. పెందుర్తిలో విజయనగరం బస్ ఎక్కి హ్యాండ్ బ్యాగ్ చూసుకోగా అందులో బంగారు వస్తువులు కనిపించలేదు.

• వేపగుంట సమీపంలోని సింహపురి కాలనీకి చెందిన తాలిశెట్టి మంగతాయారు బంగారు గొలుసును గోపాలపట్నంలోని కో ఆపరేటివ్ బ్యాంక్‌లో తాకట్టు పెట్టేందుకు ఆటోలో బయలుదేరింది. అయితే నాయుడుతోట దాటాక గొలుసు పెట్టిన ఆమె పర్స్ మాయమైంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు దర్యాప్తు చేపట్టిన వెస్ట్ జోన్ క్రైం విభాగం సీఐ శ్రీనివాసరావు, పెందుర్తి క్రైం విభాగం ఎస్ఐ డి.సూరిబాబు ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితులు అనకాపల్లి జిల్లా కె.కోటపాడు గొట్లాం గ్రామానికి చెందిన రావుల వసంత, మేకల సంధ్యలను పట్టుకున్నారు. వారి నుంచి సొత్తును రికవరీ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వెల్లడించారు. కేసుల్లో ప్రతిభ కనబరిచిన హెచ్‌సీ జి.నాగరాజు, పీసీలు శివప్రసాద్, దేముడునాయుడు, తాతారావు, శ్రీనివాసరావు, చంద్రకళలను ఉన్నతాధికారులు అభినందించారు.

చోరీలకు పాల్పడిన నిందితుడి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విష్ణు స్వరూప్, సీఐ మల్లికార్జునరావు

పరవాడ: పట్టపగలు చోరీలకు పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని పరవాడ డీఎస్పీ వి.విష్ణు స్వరూప్ వెల్లడించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. విజయనగరం జిల్లా గరివిడి మండలం కాపుసంభవం గ్రామానికి చెందిన ముగిడి రాంబాబు (30) అగనంపూడిలో నివాసం ఉంటున్నాడు. నిందితుడు గత కొంత కాలం నుంచి దొంగతనాలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్నాడు. గొర్లివానిపాలెం, మంత్రిపాలెం జేఎస్ఎన్‌యూఆర్‌ఎం కాలనీల్లో పగటి పూట 7 దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. పనులకు వెళ్లే కూలీలు, ఉద్యోగుల ఇళ్లను లక్ష్యంగా చేసుకుని ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి బంగారు, వెండి ఆభరణాలు, నగదు దోచుకునేవాడు. మంత్రిపాలెం, పరవాడ గ్రామాల్లో జరిగిన చోరీలను పరిశీలించగా ఈ నేరాలకు పాల్పడింది ఒకరేనని పోలీసులు నిర్ధారించుకున్నారు. నేరాలకు పాల్పడిన రాంబాబును మంత్రిపాలెం జేఎస్ఎన్‌యూఆర్ కాలనీలో శనివారం మధ్యాహ్నం అదుపులోకి తీసుకొని విచారించారు. ఈ విచారణలో 7 దొంగతనాలకు పాల్పడింది తానేనని నిందుతుడు ఒప్పుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ ఏడు చోరీల్లో 13 తులాల బంగారు ఆభరణాలు, 62 తులాల వెండి ఆభరణాలు, రూ.2,26,500 నగదు దొంగిలించాడు. నిందుతుడి నుంచి 10.5 తులాల బంగారు ఆభరణాలు, 39 తులాల వెండి వస్తువులు, రూ.1.30 లక్షల నగదును స్వాధీనం చేసుకుని నిందుతుడిని రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ విష్ణు స్వరూప్ వెల్లడించారు. దొంగతనాల విషయంలో ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని సూచించారు. ఈ కేసులను ఛేదించిన పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు, క్రైం హెడ్ కానిస్టేబుల్ ఎస్.వి. సాయి సంతోష్, శ్రీనివాస్, జి.వి.వి.ఎస్. నాయుడు, ఎస్.నాగేంద్రబాబు, పోలీసు సిబ్బందిని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, క్రైం అదనపు ఎస్పీ ఎల్.మోహన్‌రావు, డీఎస్పీ విష్ణు స్వరూప్ అభినందించారు.

ఆక్సిజన్ సిలిండర్ల వితరణ


సిలిండర్లు అందిస్తున్న సాధన ఫిజియోథెరపీ ప్రతినిధులు

పెందుర్తి: సుజాతానగర్‌కు చెందిన సాధన ఫిజియోథెరపీ కేంద్రం ప్రతినిధులు పెద్ద మనసు చాటుకున్నారు. అత్యవసర పరిస్థితిలో రోగులకు ఆక్సిజన్ అందించేందుకు రెండు ఆక్సిజన్ సిలిండర్లు, రెండు నైట్రోజన్ సిలిండర్లను పెందుర్తిలోని సాయి హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థకు అందించారు. దాదాపు 12,500 విలువైన ఈ సిలిండర్లను సమకూర్చడం పట్ల సాయి హెల్పింగ్స్ హ్యాండ్స్ ప్రతినిధి దాడి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. అత్యవసర సమయంలో రోగులకు ఉచితంగా ఈ సిలిండర్ సేవలు అందిస్తామని పేర్కొన్నారు.

సాగర తీర పరిశుభ్రతలో స్వచ్ఛంద భాగస్వామ్యం


విక్టరీ ఎట్ సీ తీరం వద్ద సేకరించిన వ్యర్థాలతో స్వచ్ఛంద సంస్థల సభ్యులు

ఏయూక్యాంపస్: సాగర తీరాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి నిరంతరం నగరవాసులు, స్వచ్ఛంద సంస్థలు పని చేస్తున్నాయి. దీనిలో భాగంగా శనివారం ఉదయం ప్లాస్టిక్ ఫర్ చేంజ్ సంస్థ, గార్నియర్ ఇండియా సహకారంతో బీచ్ క్లీనింగ్ కార్యక్రమం నిర్వహించింది. ఆర్కే బీచ్, వైఎంసీఏ–విక్టరీ ఎట్ సీ వద్ద సాగర తీరంలో ఉన్న వ్యర్థాలను స్వచ్ఛందంగా ఏరివేశారు. వీటిలో పెట్ బాటిల్స్ 60 కేజీలు, ప్లాస్టిక్ 300 కేజీలు, గాజు సీసాలు 230 కేజీలు, కొబ్బరి బొండాలు 120 కేజీలు, చెప్పులు 60 కేజీలు, కర్రలు 400 కేజీలు, తాళ్లు, ఇతర వస్తువులు 30 కేజీలు ఉన్నాయి. ప్రజల సహకారం, భాగస్వామ్యంతో ఇటువంటి సమాజహిత కార్యక్రమాలు చేపట్టడం వీలవుతుందని వైజాగ్ ఎన్‌జీవో ఫోరం కార్యదర్శి ప్రజ్ఞాన్ కుమార్ తెలిపారు. సత్యవేణి సమన్వయం చేసిన ఈ కార్యక్రమంలో అర్జున్ తదితరులు, నగరానికి చెందిన 313 మంది స్వచ్ఛందంగా పాల్గొని సాగర తీరాన్ని శుభ్రం చేశారు.